మగువ పొలుపు

చల్లటిగాలి మందంగా వీచటం మొదలుపెట్టింది. తడకల ఆవరణంలో నులకమంచాల మీద పడుకున్న రోగులకు అప్పుడప్పుడే కన్ను మలగుతున్నది. శారీరకమైన బాధలు ఒక్కొక్కటే చేత్తో తీసేసినట్టుగా నిద్రలోకి జారుకుంటు న్నారు.

తెల్లవార్లూ "అమ్మా, అబ్బా" అంటూ మూలుగుతూ ఉంటారు రోగులు వాళ్ళ మూలుగులు ఆ తోటలో చెట్లకొమ్మలలోనుంచి అరమైలు దూరాన ఉన్న ఊళ్లోకి వినబడుతూ ఉంటాయి.

ఉదయం ఆరుగంటలకు ఎర్రంచు తెల్లచీరె కట్టుకుని - దానిమీద తెల్లటి రవిక తొడుక్కుని - తలవెంట్రుకలు జారకుండా గట్టిగా ముడివేసుకుని - దాని మీద తెల్లటిబట్ట కట్టుకుని - చందమామలాంటి ముఖానికి దృష్టి తగలకుండా పెద్ద బొట్టు పెట్టుకుని - అకు చెప్పులు వేసుకుని శీల ఆవరణంలో అడుగుపెడుతుంది.

అది పది ఎకరాల తోటలో తడకల ఆవరణంలో పెద్ద పెద్ద పాకలతో వేసిన నర్సింగ్‌హోం. ఏభయి మంచాలు వేసి ఉంటాయి. కాని - మూడూ, నాలుగూ మంచాలు ఖాళీగానే ఉంటాయి. శీల అడుగుపెడుతూనే రోగులు పడు కున్న మంచాలను లెక్కబెట్టుకుంటుంది. గబగబా నాలుగు బకెట్ల నీళ్ళు తెచ్చిపెట్టు కుని ఒక్కొక్కరికే చెంబుల్లో నీళ్ళు పోస్తూ "అయ్యగార్లూ! లేవండి! ముఖాలు కడగండి" అంటూ కేకలు పెడుతుంది. రెండవ మలుపులో మంచాల దగ్గర అందరికీ బేసిన్లు పెట్టుకుంటూ పోతుంది. మూడవ మలుపులో కూర్చుని కళ్ళు నులుపుకుంటున్న వాళ్ళ చేతుల్లో పళ్ళపొడి రాల్చుతుంది.

"వచ్చావు అప్పుడే మమ్మల్ని లేపటానికి?"

"ఇప్పుడిప్పుడే కళ్ళు మూతలు పడుతున్నాయి. ఇంతలోకి రానేవచ్చావు!"

''నిద్ర పట్టనే పట్టదు. పట్టగానే తరుముకుంటూ వస్తావు.''

ఇలా ఒక్కొక్కరే నవ్వుతూ, నవ్వుతూనే నిష్ఠూరాలాడుతూ ఉంటారు శీల ముఖంలోకి చూస్తూ.

"నన్నంటారేం? గడియారాన్నడగండి. ఏడు గంటలకు డాక్టరుగారు వచ్చేటప్పటికి ముఖాలు కడుక్కొని రొట్టె తిని, వేడి వేడి కాఫీ త్రాగి, బట్టలు మార్చుకుని శుభ్రంగా కనబడండి'' నిష్ఠూరమైన నిజాల్ని నవ్వుతూ చెప్పి శీల తన పనిలో నిమగ్నమయిపోతుంది.

డాక్టరు కృష్ణమ్మ ఖద్దరు పైజామా-లాల్చీ-నల్లటి ఫ్రేముగల కళ్ళద్దాలు-నెరిసీ నెరవని ఒత్తయిన క్రాపు-నల్లటి దేహచ్ఛాయ అయినా కళగల ముఖమూ-తేజస్సు లొలికే పెద్ద కళ్ళూ-పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తన భారీ దేహాన్ని చురుకుగా నడిపిస్తూ ఆవరణంలో ప్రవేశించిన గుర్తుగా చిన్న ఈలవేస్తాడు.

రోగులందరికీ ఉదికిన దుప్పట్లు కప్పి-మెడల దగ్గర మడిచి-రెండు చేతులు ఛాతీమీద పెట్టి-తన పని అయిందన్నట్టుగా సుగ్రీవులు పొట్టిలాగు-పొట్టి చేతుల షర్టూ తొడుక్కొని క్రాపు రెండు చేతులతో సవరించుకొంటూ ఆవరణం ముందర నిలబడతాడు. డాక్టరు కృష్ణమ్మ ఈలపాట వినగానే వెన్నువిరుచుకొని - చురుకుదనం తెచ్చుకుని ఎదురుగా వెళ్ళి "దణ్ణం బాబూ!" అంటాడు సుగ్రీవులు.

సుగ్రీవులు ముఖం చూడగానే తెలిసిపోతుంది. డాక్టరుకు - రోగులందరూ క్షేమంగా ఉన్నారని. హుషారుగా లోపలికి వచ్చి, అందరినీ పరిహాసం చేస్తూ పలకరించి ఒక్కొక్కరినే పరామర్శ చేస్తాడు.

ఆ పలకరింపు అమృతప్రాయంగా ఉంటుంది రోగులకు. తమ బాధలన్నీ వెళ్ళబోసుకుంటూ -.మందుమార్చమని డాక్టరుకు సలహాలిస్తూ - తమ దగ్గర మరో పది నిమిషాలు నిలబడి తమ గోడు వినమని వేడుకుంటారు రోగులు.

"నేను చెప్పింది మీరు వింటున్నారా? ఈ తల నిన్న సాయంత్రం నుంచి సహస్ర శకలాలయిపోతున్నది. మీరు రాత్రి పంపిన మందుతో ఏమీ తగ్గలేదు" అంటా డొక రోగి.

"మీ చెయ్యి మంచిదని చెప్పగా విని ఇంతదూరం వచ్చాను డాక్టరుగారూ! నా కడుపునొప్పి తగ్గటంలేదు" అంటాడు పదవనెంబరు రోగి.

అందరూ అన్ని రకాల బాధలూ వర్ణించి చెబుతుంటే డాక్టరు కృష్ణమ్మ ముఖం యధాప్రకారంగా ఉంటుంది మందహాసంతో.

సుగ్రీవులకు ఒళ్లు మండిపోతుంది.

"డాక్టరుగారిని చూడగానే ఎక్కడలేని రోగాలు పుట్టుకొస్తాయి వీళ్ళకు" పళ్లు కొరుకుతాడు.

శీల పదకొండు గంటలకు రోగుల కందరికీ డాక్టరు చెప్పిన విధంగా దూరంగా ఉన్న పాకలో వంటచేసి తీసుకువచ్చి పెడుతుంది.

రోగులందరూ నిద్రకొరిగి ఉండగా చూసి మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఆ సమీపంలో ఉన్న ఇంటికి వెళ్ళి సాయంత్రము నాలుగు గంటలకు తిరిగి అక్కడికి వస్తాడు డాక్టరు. ఈ లోపల రోగుల భారమంతా సుగ్రీవులు, శీల వహిస్తారు.

రాత్రి పన్నెండు గంటల సమయం. రోగులందరూ హాయిగా, గాఢంగా నిద్రపోతున్నారు గదా అని సుగ్రీవులు ఆదమరచి నిద్రకు లోనైనాడు.

"బాబూ! బాబూ!" గట్టిగా అరుస్తున్నారు నలుగురు మనుష్యులు తడక దగ్గరగా నిలబడి.

సుగ్రీవులుకు పిలుపందలేదు

రెండు, మూడుసార్లు పిలిచిన తరువాత వాళ్ళల్లో సహనం తగ్గింది. కొండ కేకలు పెట్టారు.

ఉలిక్కిపడి దిగ్గున లేచాడు సుగ్రీవులు కప్పుకున్న దుప్పటిని కాళ్ళతో తన్నుకుంటూ. కళ్ళు నులుముకుంటూ తడక దగ్గరికి వెళ్ళాడు.

అంతలో మరో కేక.

పరుగుతీశాడు సుగ్రీవులు. ఆయాస పడుతూ తడకకు కట్టిన తాడు తీశాడు.

తిరగవేసిన నులకమంచంలో పడుకుని మూలుగుతున్నా డొకరోగి, మంచంలోనుంచి రక్తం బొట్లుబొట్లుగా కారుతున్నది.

సుగ్రీవులు ఆ మంచాన్ని తాను కూడా పట్టి లోపలికి చేర్చాడు. ఒక్క పరుగున డాక్టరింటికి వెళ్ళి తలుపుకొట్టాడు.

"బాబూ! బాబూ! ఘోరం బాబూ! ఒక కేసు వచ్చింది. రక్తం కారుతూ మడుగులు కడుతున్నది" ఆయాసపడుతూ చెప్పి. వాకిట్లోకి వచ్చిన డాక్టరును అనుసరిస్తూ అలుపు తీర్చుకుంటున్నాడు.

"ఏం కేసు? ఆడా. మగా?" టార్చిలైటు చూపిన మార్గాన నడుస్తూ ఒక చేత్తో తల నవరించుకుంటున్నాడు, డాక్టరు కృష్ణమ్మ. ఇద్దరూ నడిచారు. అది మామూలు నడకకాదు. పరుగు లాంటి నడక. పది నిమిషాలలో తడక దగ్గరికి చేరుకుని హుందాగా లోపలికి అడుగుపెట్టాడు.

రోగి వంటిమీద కప్పిన బట్టతీసిన డాక్టరు కళ్లు పెద్దవయ్యాయి. సుగ్రీవులు కెవ్వున అరవబోయి పెదవులకు రెండు చేతులు అడ్డంపెట్టుకుని ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"ఏం జరిగిం దసలు?" డాక్టరు కృష్ణమ్మ చేతులకు కట్టిన గుడ్డలు ఊడ దీస్తూ అడిగాడు.

రెండు చేతులకు బొటనవ్రేళ్ళు లేవు. రక్తముతో గుడ్డలు తడిసి ముద్ద య్యాయి. అతడిని లోపలికి తీసుకు వెళ్ళి ఇంజక్షను ఇచ్చి, మందువేసి రెండు చేతులకు కట్లు కట్టాడు. కళ్ళు తుడిచి పెదవి విరుస్తూ మందువేసి పైన దూది పెట్టాడు. సుగ్రీవులు సహాయంతో అతడిని ఒక మంచమ్మీదికి చేర్చారు, రోగికి బాధతెలియకుండా నిద్రకొక ఇంజక్షను ఇచ్చి మంచాల మధ్యగా కుర్చీవేసుకుని కూర్చున్నాడు.

అప్పటికి రోగి అరుపులకు మిగతా రోగులంతా పడకలమీద లేచి కూర్చు న్నారు. రోగితో వచ్చిన నలుగురూ తడకదాటి ఖాళీ మంచం దగ్గిరగా కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. అప్పటికి నాలుగైదుసార్లు సుగ్రీవులు ఏడవవద్దని బెదిరించి వచ్చాడు.

ఏడుస్తున్న వాళ్ళల్లో ఒకడు తండ్రి-ఒకడు తమ్ముడు-ఒకడు బావమరిది-రోగికి ఒకడు ఎరకయినవాడు.

ఈ రోజుల్లో కూడా ఇటువంటి ఘోరకృత్యాలు జరుగుతున్నాయా? పట్టణాలలోకంటె పల్లెసీమలలో ఇటువంటివి ఎక్కువగా జరుగుతాయి. ఇంత ఘోరమైన శిక్షకు ఇతడేమి చేసి ఉంటాడు? డాక్టరు కృష్ణమ్మ మనసులో రేగిన భావసంచలనము అతడి నక్కడ ఎక్కువసేపు కూర్చుండనీయలేదు.

రోగికి మత్తు ఆవరిస్తోంది. అరపులు క్రమంగా తగ్గి సన్నటి మూలుగుగా మారాయి. రోగి ముఖంలో అలసట బాగా కనిపిస్తోంది. అతడు పడిన బాధంతా ముఖంలో ద్యోతకమవుతోంది. నిద్రలో కూడా అప్పుడప్పుడు కనుబొమలు చిట్లించి ముక్కు ముడుస్తున్నాడు.

డాక్టరు కృష్ణమ్మ రోగులందరినీ ఒకసారి కంటితో చూసి "ఉఁ" అంటూ దీర్ఘంగా నిట్టూర్చి లేచాడు.

గాయపడిన రోగి వెంట వచ్చినవాళ్లు డాక్టరు వెంట కర్రగేటువరకూ వచ్చి "బాబయ్యా! వెళ్ళిపోతున్నారా?" కాళ్ళకు దణ్ణాలు పెట్టారు.

"ఏం భయంలేదు. బాగా నిద్ర పోతాడు. ఉదయం కాఫీ, రొట్టె ఇవ్వండి. నేను మళ్ళీ వచ్చి చూస్తాను."

"బాబయ్యా! వాడు బతుకుతా డంటారా?" వాళ్ళల్లో ఒకడు డాక్టరు కాళ్ళను వదిలిపెట్టలేదు.

"నిక్షేపంగా ఉంటాడు. మానటానికి కొంతకాలం పడుతుంది. మందులతో కొంత బాధ తగ్గుతుంది గాని సాంతం తగ్గదు. అతడికి ప్రాణభయంలేదు." డాక్టరు ముందుకు అడుగువేశాడు.

"అరే! డాక్టరు బాబుకు ఈ ఘోరం ఎట్లా జరిగిందో చెప్పలేదు" అన్నాడు బావమరిది.

"ఎట్లా జరిగిందో తెలిస్తే మందులు మారుస్తాడా? చెప్పినా చెప్పకపోయినా ఒకటే వైద్యము. దానిలో మార్పు ఏముంటుంది?"

మెల్లగా నడుస్తున్న డాక్టరు కృష్ణమ్మ కీమాటలు వినబడుతున్నాయి.

చిన్నగా నవ్వుకుంటూ - తల వెంట్రుకలు వెనక్కు-తోసుకుంటూ ముందుకు నడక సాగించాడు. డాక్టరు కృష్ణమ్మ ఇంటికీ, రోగులు ఉండే ఆవరణానికీ మధ్యగా ఎన్నో పెద్ద పెద్ద చెట్లు-వాటి మధ్య బండి సాగిపోగలిగి నంత బాట. దానిమీద మనుష్యులు తామే నడుస్తున్నా మనుకుంటారు గాని-నిజానికి గాలి వాళ్ళను నడిపిస్తూ ఉంటుంది. చెట్లక్రింద రాలిన పూల రాసులు గాలికి ఇటూ అటూ ఊగుతూ ఒక చోటినుండి మరొక చోటికి తోసుకుపోతూ ఉంటాయి. దారి మధ్యలో రెండు చెట్లు ఒకదానితో ఒకటి గాలి తాకిడికి పెనవేసుకుంటూ విడిపోతూ ఒక విధ మైన ఉద్వేగాన్ని సృష్టిస్తాయి. ప్రళయము వచ్చినట్టుగా ఊగిపోతాయి. వాటిక్రింద నడిచినవాళ్ళు చావు తప్పు దనుకుంటారు. డాక్టరు కృష్ణమ్మ ఆ చెట్ల దగ్గరికి రాగానే తల పైకెత్తి చూస్తాడు. ఆ చెట్లు సృష్టించే శబ్దానికి అతడి దేహము జలదరిస్తుంది. మనసు ఆదొకమాదిరిగా అయిపోతుంది.

మరునాడు ఉదయము ఎప్పటి మాదిరిగా కాకుండా చాలా తొందరగా వచ్చాడు డాక్టరు కృష్ణమ్మ. మామూలుగా వినబడే ఈలపాట వినబడలేదు సుగ్రీవులుకు. రోగులతో పరాచికా లాడుతూ అందరినీ నవ్విస్తూ తాను నవ్వుతూ పనిచేస్తున్నాడు.

వేళ్లు తెగిన రోగి "బాబూ, బాబూ" అంటూ రెండుసార్లు పిలిచాడు సుగ్రీవుల్ని.

కొంతసేపటికి "నన్నేనా ? నొప్పి తగ్గిందా ?" దగ్గరికి వచ్చి ఏంకావా లన్నట్టు చూశాడు సుగ్రీవులు.

"బాబూ ! ఒక్క-మాట. పొద్దుటి నుంచీ అందరికీ నీళ్లు అందిస్తూ ముఖాలు కడుక్కో-మని కేకలు పెట్టిందెవరు ?" మెల్లగా అడిగాడు.

సుగ్రీవులు ఆశ్చర్యంతో తల గోక్కు-ంటూ "ఏం ? నీకు నీళ్ల పొయ్య లేదా ? పళ్ళపొడి చేతిలో వెయ్యలేదా ? ఏమిటి సంగతి ?" అన్నాడు.

"మా నాయన ముఖం కడిగించాడు. అసలు ఎవరు ఆ మనిషి ?" కళ్ళ మీద ఉంచిన దూదిని కట్టుకట్టిన చేత్తో తడుముకుంటూ - వంకర నవ్వులు నవ్వుతూ అడిగాడు.

"నెప్పి పోయిందా? లేక కాస్త తగ్గిందా?" అడిగాడు సుగ్రీవులు

"డాక్టరుగారి చేతిలో పడ్డాను కదా! అదే తగ్గుతుంది. నే నడిగిన సంగతి?"

"ఇక్కడ పనిచేసే శీలమ్మ. నేను చెబుతాలే కాస్త జాగ్రత్తగా కనుక్కోమని." దాటుకుంటూ మరో మంచం దగ్గరికి వెళ్ళాడు సుగ్రీవులు.

మొదటి మంచం దగ్గర ఉండి వింటున్నాడు డాక్టరు ఈ సంభాషణ.

పన్నెండు గంటల లోపల శీల రోగు లందరికీ భోజనాలు తెచ్చింది. వేళ్ళు తెగిన రోగి దగ్గరకొచ్చి "అన్నంలోకి పులుసుపొయ్యనా - కూరవెయ్యనా?" అడిగింది.

"మన దేవూరు? ఈ ఊరు కానట్టుందే?" లేచి కూర్చోబోయాడు.

"మన దేవూరయితేనేం? కూరా? పులుసా? చెప్పు? ఎంతమంది ఉన్నారో చూడు. వాళ్ళందరికీ భోజనాలు వేళకు అందాలి. చెప్పు ఏంకావాలో?" తొందర పెట్టింది శీల

"అయ్యో! ఊరి పేరడిగితేనే తప్పా? విచిత్రంగా ఉందే?"

డాక్టరు వింటున్నవాడల్లా అతడి మంచం దగ్గరికి వచ్చాడు.

"అయితే మన దేవూరు? కులం? గోత్రం?"

నడుముమీద చెయ్యిపెట్టుకుని ప్రశ్నించాడు డాక్టరు.

"ఆఁ....తమరు....తమరు...." నసిగాడు. "నేను నేనే .... ఇక్కడ డాక్టర్ను."

ఆ సమీపంలో పిడుగుపడినట్లు అదిరిపడ్డాడు అతడు.

"డాక్టరుగారూ! తమరి గొంతు ఎక్కడో విన్నట్లే ఉంది బాబూ! చప్పున జ్ఞాపకం రావటంలేదు."

"దానికోసం బాధపడకు. నీ నొప్పిత్వరగా పోవాలని దైవప్రార్థన చేసుకో." గబగబా అడుగులువేసుకుంటూ పోయి తన కుర్చీలో కూర్చున్నాడు డాక్టరు.

రోగి మనసు అంతటితో ఆగలేదు. ఆ కంఠధ్వనిని గుర్తుపట్టి దాని తాలూకు చరిత్రకోసం పెంపరలాడటం మొదలుపెట్టింది. సివిల్ సర్జన్ గ్రేడులో ఉద్యోగం చేస్తూ జిల్లాకు అధికారిగా ఉన్న డాక్టరు ఈ మారుమూల తోటలో పాకలువేసి ఆసుపత్రి నడుపుతున్నాడే! ఉద్యోగం వదులుకుని-తన పరువు ప్రతిష్ఠలను వదలుకుని - ఈ గుడిసెల్లో పనిచేస్తూ డాక్టరవటం ఎందుకు?

ఆతడి జ్ఞాపకాలలోనుంచి - ఆలోచనలలోనుంచి - బాధలలోనుంచి డాక్టరు చరిత్రకు రూపురేఖలు అమరాయి. డాక్టరు ప్రాణదాత. తన సర్వశక్తులూ ఉపయోగించి ప్రాణం నిలపటానికే ప్రయత్నం చేసేవాడు. కాని....ఇతడు - ఈ డాక్టరు ఎక్కడ పనిచేస్తే అక్కడ నోరులేని దిగువ తరగతి స్త్రీలను మలినపరచటంలో ఆరితేరినవాడు. తియ్యని మాటలతో ఆపద్బాంధవుడిలా కనబడి సర్వం దోచుకునే దోపిడీదారు. పనిచేసిన ప్రతిచోట పదిమందిచేత ఛీ అనిపించుకుని బదిలీ చేయించుకునేవాడు.

రోగి ముఖం ఎర్రబడ్డది. నరాలన్నీ బిగుసుకున్నాయి. ఉద్రేకంతో గుండె ఎగిసెగిసిపడుతోంది. పసిబిడ్డ ప్రాణాలు కాపాడమని కాళ్ళమీదపడి తన దగ్గర ఉన్న ఐదురూపాయలు సమర్పించిన బిడ్డ తల్లిని "నాకు రూపాయలెందుకే?" అంటూ చెయ్యపట్టుకు లాగి నిలువుదోపిడీ చేసిన వైద్యుడు. ఆ ఆడది - అతడి కళ్ళకు మత్తు గొలిపిన ఆడది తన చెల్లెలు. బిడ్డ ఏడుస్తుండగా తల్లికి మానభంగం చేసిన అధము డీ డాక్టరు....

తన జ్ఞాపకాలన్నీ నిజమైతే ఇతడు-వైద్యుడి రూపంలో ఉన్న పరమ నీచుడు- దుర్మార్గుడు.

డాక్టరు ఇచ్చిన మందు తెచ్చి గొంతులో పోశాడు సుగ్రీవులు. నిద్రకు మందు-దాని ప్రభావంవల్ల అతడికి ఆవలింతలు రావటం మొదలుపెట్టాయి. అతడి మనోఫలకంపైన నిలిచి ఉద్రేకపరచిన బొమ్మలు మరుగైపొయ్యాయి....నిద్రలోకి జారుకొన్నాడు.

వేళ్లు తెగిన రోగికి క్రమంగా గాయం నయమయిపోయింది. కన్నుమాత్రం పోయింది. కట్టువిప్పితే కంటికి దృష్టి వస్తుందని అతడు ఆశపడుతున్నాడు.

రోగులలో నయమయినవారు ఇళ్లకు వెళ్లుతున్నారు. కొత్తవాళ్లు వస్తున్నారు. డాక్టరుగారు వాళ్ళను ఇంత ఇవ్వమని కచ్చితంగా అడగరు. వాళ్ళకు చేతనైనంత సంతోషంతో ఇస్తున్నారు.

వాళ్ళు "చిత్తం బాబయ్యా, మా ప్రాణాలు కాపాడారు. మీ ఋణం తీర్చుకోలేము" అంటూ దణ్ణాలు పెడతారు వెళ్ళేటప్పుడు.

"దానికేముంది? నా వృత్తే అది. మంచిది వెళ్ళండి. వెళ్ళి మళ్ళీరాకండి" అంటూ సాగనంపుతాడు డాక్టర్ స్వయంగా.

వాళ్ళ దృష్టిలో ఆయన దేవుడి తరువాత దేవుడంతటివాడు.

వారంరోజుల తరువాత రోగి ఒక చేతి వేలు లోపలినుంచి కుళ్లకురావటం మొదలుపెట్టింది. అతడి వెంటఉన్న వాళ్ళతో చెప్పాడు, డాక్టరు-"నేనుప్రయత్నము చేస్తున్నాను గాని - లాభం కనబడటంలేదు చెయ్యి మణికట్టు వరకూ తీసివెయ్యాలి."

"బాబూ! కనికరించండి. చెయ్యిపోతే వాడు బ్రతికేదెట్లా? బ్రతుకుతెరువు కాస్తా పోతే పోయింది. అన్న మయినా తినేటట్లు చెయ్యండి" దణ్ణాలు పెడుతూ తడక గేటువరకూ వచ్చాడు.

"నేనేం చెయ్యను! నా చేతుల్లో ఏమీలేదు. పరిస్థితి అలా ఉన్నది."

మరునాడు మణికట్టువరకూ ఒక చెయ్యి తీసేశారు. నిద్రకు మందిచ్చినా పనిచేయటంలేదు. రోగి కేకలు పెడుతున్నాడు.

"లేవండి, లేవండి. ముఖాలు కడగండి. డాక్టరుగారు వస్తారు."

మార్దవమైన సన్నటి కంఠధ్వనికోసం ఎదురుచూసిన రోగికి కర్ణకఠోరమైన ధ్వని వినబడ్డది. తన మనసును రంజింపచేసిన కాలిపట్టాల చిరుగజ్జెల సవ్వడి ఆనాడు వినరాలేదు. మనసులో గిలిగింతలు పెట్టిన గాజుల గలగల కర్ణపుటాలకు తాకలేదు. శీల ఎందుకు రాలేదు?

మరునాడు-ఆ మరునాడు-తరువాత వారంరోజులవరకు శీల పదధ్వనులు అతడికి వినరాలేదు.

"సుగ్రీవులూ!"

"ఏం బాబూ! నిద్రరాలేదా? డాక్టరుగారికి చెప్పి మరోడోసు ఇప్పించనా!"

"వద్దు. వద్దు. నా కటువంటిదేమీ వద్దు. సుగ్రీవులూ! అట్లా పరుగులు తీస్తావేం? మాట, ఇలా రా."

"నాకు వెయ్యి పనులు బాబూ! ఒక్కళ్ళ దగ్గరే నేను ఇంతసేపు నిలబడితే ఎట్లా?"

"బాబ్బాబు. అసలే ఈ చేతి బాధతో నిద్రాహారాలు లేక ఏడుస్తున్నా. కాస్త మంచీ చెడ్డా మాట్లాడేవాళ్లు కావాలి."

"అయితే చెప్పు. కాని-త్వరగా చెప్పు.

"చూడు బాబూ! అయితే ఆమె ఎందుకు రాలేదు?"

సుగ్రీవులు నవ్వాడు బిగ్గరగా. "మానవ దేహం. జ్వరమో, కడుపు నొప్పో-ఏదో వచ్చి ఉంటుంది. తగ్గితే వస్తుంది" అన్నాడు మామూలుగా.

మరొక వారం అయినా శీల రాలేదు.

"సుగ్రీవులూ, అయితే శీల ఇంక రాదా?"

"నీకేం లోపం జరగటం లేదుకదా. ఇంకేం? ఎప్పుడో వస్తుంది." సమాధానం చెప్పి సాగిపోయాడు సుగ్రీవులు.

"హుఁ శీల——ఆ శీలే ఇదయితే మరి రాదు. నేనుండగా రాదు" పళ్ళు కొరికాడు రోగి.

అతడు గ్రామ మునసబుకు సలహాదారు. మునసబుకంటె ఆ గ్రామం సంగతీ-గ్రామస్థుల సంగతి-ఆస్తి పాస్తుల వివరాలు - జనన మరణాలు - అన్నీ అతడికి తెలుసు. అతడికి ఎదురు చెప్పి-ఎవరూ బాగుపడలేదు అందరి ధన మాన ప్రాణాలు అతడి చేతిలో ఉండేవి. ఒక్క కరణం ఇంటి జోలికి మాత్రంపోలేదు. మిగతా గ్రామమంతా తన చేతిలోనే ఉంది అటువంటి గ్రామంలోకి ఈ శీల గామ సేవికగా వచ్చింది....అతడి చేతి కందలేదు. అందకపోగా-అతడిప్రయత్నా

-అలో బూడిదపోసి పైవాళ్ళకు చెప్పి అతడిని అరెస్టు చేయించి - తాను బదిలీ చేయించుకుంది, "అప్పుడు తప్పించుకున్నది ఇప్పుడు ? ఎట్లా తప్పించుకుంటుందో చూడాలి. నేనింతటితో దాన్ని విడిచిపెడతానా?"

ఆలోచనలు టక్కున ఆగిపోయాయి. నిద్రలోకి జారుకున్నాడు.

"సుగ్రీవులూ ! నా చెయ్యి నయమవుతుందా?" దీనంగా అడిగాడు.

"ఎందుకు కాదు ? కుళ్ళిపోయిన భాగం తీసేశారుకదా. ఇంక బాగవుతుందిలే" గొంతులో మందు పోసి దుప్పటి సరిగా కప్పి వెళ్ళబోయాడు సుగ్రీవులు.

"చూడు సుగ్రీవులూ ! ముఖాలు కడిగించటం- అన్నం పెట్టటం ఈ పనులు ఎట్లాగయినా ఆడపనులు. అవి ఆడవాళ్లు చేస్తేనే అందం. రోగుల కయినా వాళ్ళ మాట వినబడగానే అమృతం చిలికినట్లవుతుంది. ప్రాణం లేచివస్తుంది. బాధలన్నీ మరచిపోతారు. మీ డాక్టరుగారు శీలలాంటి ఆడమనిషిని తీసి ఈ మోటు మగవాణ్ణి పెట్టారెందుకయ్యా?"

"కాదు బాబూ ! ఆడవాళ్ళను పెడితేనే రోగాలూ, బాధలూ ఎక్కువవుతున్నాయి ఇక్కడ. మీరేమో ఇంకోలా మాట్లాడుతున్నారు."

నెలరోజుల తరువాత రోగికి మల్లెల వాసన ముక్కుపుటాలకు తాకింది. కాలి పట్టాల చిరుగజ్జెల సవ్వడి గాజుల గలగల కర్ణపుటాలకు తాకింది తీయటి కంఠం ఒళ్లు పులకరింపచేసింది. రోగి ముఖం వికసించింది. కంటిరెప్పలు కదలాడాయి. మొలకనవ్వులు పెదవుల నలంకరించాయి. అతడు కంటితో ఆమెను చూడలేదు ఒక చెయ్యి మొండిది. మరొకచెయ్యి, కాలు చచ్చుపడ్డాయి. చేతితో ఆమెను తాకలేదు. కాని - కాని - మగువ పొలుపు-ఒకప్పుడు తన చెయ్యి జారిపోయిన మగువ ఉనికి -అతడిని పరవశం చేస్తున్నాయి.

"శీలా ! వీళ్ళంతా నీ బిడ్డలు. నీవు లేని నెల్లాళ్లూ నీకోసం అందరూ కలవరించారు" అంటున్నాడు సుగ్రీవులు.

"వీళ్ళంతా నా బిడ్డలా ! నా కోసం కలవరించారా !" పకపక నవ్వింది శీల.

"వాడు కూడా కలవరించాడా ? వాడు ఆ చెయ్యీ-కన్నూ లేనివాడు కూడా?"

"ఆఁ. వాడే ఎక్కువగా కలవరించాడు," అంటున్నాడు సుగ్రీవులు నవ్వుతూ.

"వాడా? వాడికి ఆ వేళ్ళు ఎందుకు పోయాయో తెలుసా? ఆ కన్ను ఎందుకు పోయిందో ఎరుగుదువా? అందరిమీదా కన్నువెయ్యకుండా ఎవరో కన్ను పొడిచారు. అందరినీ నాశనం చెయ్యకుండా ఎవరో వేళ్లు కోసేశారు. నన్నడిగితే కాళ్లు కొట్టెయ్యమనేదాన్ని." ఆవేశంతో అంటోంది శీల.

రోగి అంత బాధలోనూ నవ్వుతున్నాడు. తను ఎన్నిసార్లు ఎంతకాలం నుంచి వింటున్నాడీ మాటలు. మాటలు గాలికి పోతాయి. కాని మగువ పొలుపు? అది ఎటువంటి పరిస్థితులలో కూడా తన మనసును అలరిస్తూనే ఉంటుంది.

అతడి పెదవుల మీద ఆ నవ్వు చాలాసేపు నాట్యం చేసింది.

డాక్టరు కృష్ణమ్మ తల ఆడిస్తున్నాడు కుర్చీలో కూర్చుని.

(యువ — మాస పత్రిక)